అంబాపురంలో దాహం..దాహం

- చెంతనే కృష్ణమ్మ ఉన్నా..అందని తాగునీరు
- ఆర్వో ప్లాంట్ల పైనే ఆధారపడుతున్న ప్రజలు
- పట్టించుకోని పాలకులు

విజయవాడరూరల్: విజయవాడ నగరానికి కూత వేటు దూరంలో ఉన్న అంబాపురం గ్రామాన్ని తాగునీటి సమస్య వెంటాడుతోంది. ఆ గ్రామం మీదుగా కృష్ణానది నీరు నూజివీడు ట్రిపుల్ ఐటీకి సరఫరా అవుతోంది. సరిహద్దులో ఉన్న పైపుల రోడ్డు ప్రజానీకం, పక్కనే ఉన్న జక్కంపూడి కాలనీ వాసులు కూడా కృష్ణానది నీటినే తాగుతున్నారు. కాని మేమేం పాపం చేశామని వారికి కృష్ణా జలాలు తాగడానికి అందుబాటులోకి రావడం లేదని అంబాపురం గ్రామ ప్రజలు పాలకులను ప్రశ్నిస్తున్నారు. తప్పనిసరి పరిస్థితిలో అంబాపురం గ్రామస్తులు ఆర్వో ప్లాంట్లపై ఆధారపడి తాగునీరు కొనుక్కోవలసిన దుస్థితి ఏర్పడిందని వాపోతున్నారు. 20 లీటర్ల టిన్ను ప్లాంటు వద్ద కొనుగోలు చేస్తే 15 రూపాయలు, ఇంటికి సరఫరా చేస్తే 20 రూపాయల చొప్పున వ్యాపారాలు జరుగుతున్నాయి. వాడుక నీటి కోసం బోర్లు స్వంతంగా వేయించుకున్న వారు సాల్ట్ వాటర్ కావడంతో అనేక వ్యాధులకు గురవుతున్నారు. పేదప్రజలైతే దిక్కులేక బోరు నీరు తాగడం వలన తీవ్రమైన ఎండలకు వాంతులు, విరేచనాలు, కడుపునొప్పి, జిగట విరేచనాలు లాంటి వ్యాధుల బారిన పడుతూ వైద్యులను ఆశ్రయించాల్సి వస్తోంది. ఒకటవ వార్డు ప్రజానీకానికి అయితే బోరునీరు కూడా అందుబాటులో లేని దీనస్థితిలో బతుకుతున్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్ డిస్ట్రిక్ట్ మినరల్ ఫౌండేషన్ ట్రస్ట్ నుంచి 78 లక్షల రూపాయలను మంజూరు చేయించి లక్షా 50వేల లీటర్ల సామర్థ్యం గల ఓవర్‌హెడ్ ట్యాంక్ నిర్మాణానికి కృషి చేశారు. ఓవర్‌హెడ్ ట్యాంక్ నుంచి నీటి సరఫరా అయ్యే విధంగా 65లక్షల రూపాయల జలజీవన్ మిషన్ గ్రాంటు మంజూరు చేయించి పైపులైను నిర్మాణం పనులు పూర్తి చేశారు. అదే పథకంలో ఇంటింటికీ కుళాయి కనెక్షన్లు ఇవ్వడం ద్వారా విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ నుంచి తాగునీరు సరఫరా చేసేందుకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం శాయశక్తులా కృషి చేసింది. చివర్లో ఎన్నికల కోడ్ వచ్చిందని ఆ పనులు మధ్యలో నిలిచిపోయాయి. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన పిమ్మట మంచినీటి సమస్యను పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పాత గ్రామం వరకు పూర్తిఅయిన పైపులైను నిర్మాణానికి వీఎంసీ అధికారులతో మాట్లాడి కనెక్షన్ ఇప్పించాలని గ్రామస్తులు కోరుతున్నారు. వాటర్ ట్యాంక్ నిర్మాణం పనులు పూర్తి చేసి పైపులరోడ్డు సమీపం లోని ఒకటవ వార్డు ప్రజానీకానికి మంచినీరు సరఫరా అయ్యే విధంగా చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు.


అంబాపురంలో అర్ధాంతరంగా ఆగిపోయిన పైప్‌లైన్ నిర్మాణం పనులు

వీఎంసీ వాటర్‌ను సరఫరా చేయాలి

ప్రతి మనిషి రోజుకు కనీసం 3 లీటర్ల నీటిని తాగాలని వైద్యులు చెబుతున్నారు. ఎండాకాలంలో అయితే ఇంకా ఎక్కువ అవసరం ఉంటుంది. లేకపోతే డీ హైడ్రేషన్‌కు గురయ్యే ప్రమాదం ఉంది. మేము తాగునీరు కొనుక్కుని తాగవలసి వస్తోంది. వీఎంసీ వాటర్‌ను ట్యాంకుల ద్వారా సరఫరా చేయాలి.

–సాయికుమార్, కె.అంబాపురం 3వ లైను

వాటర్ ట్యాంక్ నిర్మాణం త్వరితగతిన పూర్తి చేయాలి

పార్కు స్థలంలో నిర్మించతలపెట్టిన ఓవర్‌హెడ్ ట్యాంక్ నిర్మాణం త్వరితగతిన పూర్తి చేయాలి. సాల్ట్ వాటర్‌తో గ్రామస్తులు అనేక వ్యాధులకు గురవుతున్నారు.

–నల్లమోతు చంద్రశేఖర్, వైఎస్సార్ సీపీ గ్రామ కన్వీనర్

ఆరు నెలల్లో ఓవర్ హెడ్ ట్యాంక్ నిర్మాణం పూర్తి చేస్తాం

అంబాపురం గ్రామంలో డీఎంఎఫ్‌టీ గ్రాంటుతో ఓవర్ హెడ్ ట్యాంకు నిర్మించ తలపెట్టాం. ఓవర్ హెడ్ ట్యాంక్ నిర్మాణం పనులు ప్రారంభించి ఆరు నెలల్లో పూర్తి చేస్తాం.

–శ్వేత, ఏఈ, గ్రామీణ నీటి సరఫరా విభాగం

టీడీపీ నేతల దిగజారుడు రాజకీయం

- ప్రజల గుండెల్లో వైఎస్సార్
- వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త దేవభక్తుని చక్రవర్తి

పెనమలూరు: టీడీపీ నేతలు దిగజారుడు రాజకీయాలు మానాలని, లేకపోతే భవిష్యత్తులో తగిన గుణపాఠం తప్పదని పెనమలూరు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త దేవభక్తుని చక్రవర్తి హెచ్చరించారు. కానూరులో వైఎస్సార్ సీపీ కార్యాలయంలో మంగళవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తాడిగడప మున్సిపాలిటీకి మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి పేరును మార్చటం, విగ్రహాలు తొలగించటం టీడీపీ నేతల దిగజారుడు రాజకీయాలకు నిదర్శనమని విమర్శించారు. వైఎస్సార్ రాష్ట్ర ముఖ్యమంత్రిగా పని చేసిన కాలంలో పేద ప్రజలకు ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేశారన్నారు. ఏపీ అభివృద్ధికి ఆయన చేసిన కృషి మరువలేనిదన్నారు. ప్రజల మనిషిగా ఉన్న వైఎస్సార్ పేరును తాడిగడప మున్సిపాలిటీ నుంచి తొలగించటం దారుణమన్నారు. గతంలో కూటమి నేతలు తాడిగడప జంక్షన్‌లో వైఎస్సార్ విగ్రహాన్ని తొలగించారని, వైఎస్సార్ పేరు, విగ్రహం తొలగించినంత మాత్రాన ప్రజల గుండెల్లో చిరస్థాయిగా ఉన్న వైఎస్సార్‌ను తొలగించలేరన్నారు. జగన్ సీఎంగా ఉన్న కాలంలో ఉమ్మడి కృష్ణా జిల్లాను విభజించిన సమయంలో విజయవాడ కేంద్రంగా ఎన్టీఆర్ పేరుతో జిల్లాకు పేరు పెట్టారన్నారు. టీడీపీ నేతలకు దమ్ముంటే జగన్ పెట్టిన ఎన్టీఆర్ జిల్లా పేరును తొలగించగలరా అని సవాల్ చేశారు. మరల జగనన్న సీఎం అయిన వెంటనే తాడిగడప మున్సిపాలిటీకి వైఎస్సార్ పేరు పెడతామని, తాడిగడప జంక్షన్‌లో భారీ విగ్రహం కూడా ఆవిష్కరిస్తామని చెప్పారు. అధికారం అడ్డుపెట్టుకుని రెచ్చిపోతున్న టీడీపీ నేతలకు రిటర్న్ గిఫ్ట్ తప్పదన్నారు. కూటమి ప్రభుత్వం ముందు ప్రజలకు ఇచ్చిన సూపర్‌సిక్స్ హామీలు వెంటనే అమలు చేయాలని చక్రవర్తి డిమాండ్ చేశారు. సమావేశంలో పార్టీ నేతలు పి.రాఘవరావు, చక్కా గోపి, మండూరు కోటేశ్వరరావు, ఫజల్‌హక్ తదితరులు పాల్గొన్నారు.


కానూరులో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న దేవభక్తుని చక్రవర్తి

అపరాలకు గిట్టుబాటు ధర కల్పించాలి

ఉంగుటూరు: ఆరుగాలం కష్టపడి పండించిన అపరాలు(మినుము, పెసలు) ధరలు పడిపోయాయని రైతులు, కౌలు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తేలప్రోలు ఎస్సీకాలనీలో మంగళవారం సీపీఎం నిర్వహించిన ప్రజా చైతన్య యాత్ర దృష్టికి ప్రజలు పలు సమస్యలను తీసుకు వచ్చారు. ఎస్సీలకు శ్మశానవాటిక స్థలం లేదని, డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతో మురుగు నీరు దుర్గంధం వెదజల్లుతోందని వాపోయారు. జాబ్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ ఉపాధి పనులు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి అజ్మీర వెంకటేశ్వరరావు, మాగంటి సాంబశివరావు, చౌటపల్లి ప్రభాకరరావు, రోశయ్య, స్టాలిన్, రవితేజ పాల్గొన్నారు.

అన్నదానం

హనుమాన్‌జంక్షన్ రూరల్: స్థానిక ప్రసిద్ధ అభయాంజనేయ స్వామి దేవస్థానంలో మంగళవారం విశేష పూజలు, అన్నదానం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు ఆలయానికి విచ్చేసి హనుమంతుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. తమలపాకులతో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రాంగణంలో దాతలు దేవభక్తుని శ్రీనివాస్, శ్రీలక్ష్మి దంపతులు (ధనలక్ష్మీ మెడికల్ షాపు) సహకారంతో 200 మంది భక్తులకు అన్న ప్రసాద వితరణ నిర్వహించారు. ఆలయ ఈవో పితాని తారకేశ్వర మూర్తి ఏర్పాట్లు పర్యవేక్షించారు.

విద్యార్థులకు కంప్యూటర్ల పంపిణీ

గుణదల(విజయవాడ తూర్పు): ఖాతాదారులకు బ్యాంకింగ్ సేవలు అందించడంతో పాటు సామాజిక సేవా కార్యక్రమాల్లో తమ బ్యాంక్ ముందంజలో ఉందని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మచిలీపట్నం రీజనల్ హెడ్ కె.వెంకటరావు అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని గుణదలలోని విజయమేరి సంయుక్త అంధ బాలల పాఠశాలలో కంప్యూటర్లు, మైక్ సెట్లను మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఖాతాదారులకు మెరుగైన సేవలందించడంలో తమ బ్యాంక్ నిబద్ధతగా పనిచేస్తోందన్నారు. సామాజిక కార్యక్రమాల్లో సైతం తాము ముందంజలో ఉన్నామని తెలిపారు. దీనిలో భాగంగా గుణదలలోని సంయుక్త అంధబాలల పాఠశాల విద్యార్థులకు కంప్యూటర్లు, మైక్ సెట్లు, సీలింగ్ ఫ్యాన్లు అందచేశామన్నారు. అంధ విద్యార్థులకు మంచి భవిష్యత్‌ను అందించే దిశగా విజయమేరి పాఠశాల చేస్తున్న కృషిని అభినందించారు. ఈ కార్యక్రమంలో చీఫ్ మేనేజర్ వరలక్ష్మి, బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

అన్నపూర్ణ ట్రస్ట్‌కు ఎక్స్‌లెన్స్ అవార్డు

రామవరప్పాడు: విజయవాడ రూరల్ మండలం ప్రసాదంపాడులోని అన్నపూర్ణ ట్రస్ట్ చేస్తున్న సేవలను ఫెడరేషన్ ఆఫ్ తెలుగు అసోసియేషన్స్ ఆఫ్ మహారాష్ట్ర (ఎఫ్ టామ్) గుర్తించింది. ఈ సందర్భంగా ఈనెల 16న నగరంలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో నిర్వహించిన 'వారధి' కార్యక్రమంలో సినీ హీరో సుమన్, ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ చేతుల మీదుగా ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షురాలు టి.జ్యోతిని శాలువాతో సత్కరించి ఎక్స్‌లెన్స్ అవార్డును అందజేశారు. ఈ సందర్భంగా అవార్డు గ్రహీత జ్యోతి మాట్లాడుతూ 2007లో అన్నపూర్ణ ట్రస్ట్‌ను స్థాపించి నగర వ్యాప్తంగా ఎన్నో సేవా కార్యక్రమాలను దిగ్విజయంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. నిత్యం విజయవాడలో నిరు పేదలు, నిరాశ్రయులకు అన్నదానం చేస్తున్నామన్నారు. కరోనా, వరదలు వంటి విపత్కర సమయాల్లో ట్రస్ట్ ఆధ్వర్యంలో వందలాది మందికి భోజన, నిత్యావసర వస్తువులు, దుస్తులు అందజేసినట్లు వివరించారు. నిస్వార్థంతో చేసిన ఈ సేవలను మహారాష్ట్ర వారధి సంస్థ గుర్తించి ఈ ఎక్స్‌లెన్స్ అవార్డును అందజేయడం సంతోషంగా ఉందన్నారు. ఈ స్ఫూర్తితో భవిష్యత్‌లో మరిన్ని సేవా కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహిస్తామని తెలిపారు.



సినీ హీరో సుమన్, కలెక్టర్ లక్ష్మీశ చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న జ్యోతి

ఆటో నుంచి జారి పడి వ్యవసాయ కూలీ దుర్మరణం

హనుమాన్‌జంక్షన్ రూరల్: 216హెచ్ జాతీయ రహదారిపై బాపులపాడు మండలం ఆరుగొలను వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో అనకాపల్లి జిల్లాకు చెందిన ఓ వ్యవసాయ కూలీ దుర్మరణం చెందాడు. పొట్టకూటి కోసం పొరుగుజిల్లాకు వచ్చి అనంతలోకాలకు చేరుకున్నాడు. పరిమితికి మించి కూలీలను ఆటోలో ఎక్కించుకోవటంతో ప్రమాదవశాత్తూ కిందకు జారి పడిపోవటంతో ఈ దుర్ఘటన చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్లితే.. అనకాపల్లి జిల్లా గోలుగొండ మండలం జోగంపేటకు చెందిన బావవరపు మల్లేశ్వరరావు (48) పదిరోజుల క్రితం మినపతీత పనుల నిమిత్తం కూలీగా హనుమాన్‌జంక్షన్ వచ్చాడు. ఈ నేపథ్యంలో గుడ్లవల్లేరు మండలం డోకిపర్రులో మినపతీత కూలీగా వెళ్లి మంగళవారం సాయంత్రం తిరిగి తోటి కూలీలతో ఆటోలో తిరిగి వస్తుండగా, ప్రమాదవశాత్తూ ఆరుగొలను వద్ద ఆటోలో నుంచి జారి పడ్డారు. దీంతో తీవ్ర గాయాలు కావటంతో హుటాహుటిన విజయవాడ ప్రభుత్వాసుపత్రికి తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ మల్లేశ్వరరావు మృతి చెందాడు. ఈ ఘటనపై హనుమాన్‌జంక్షన్ ఎస్ఐ–2 నరసింహ మూర్తి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ముగిసిన ఎస్డీఆర్ఎఫ్ ప్రాంతీయ స్థాయి పోటీలు

గన్నవరంరూరల్: మండలంలోని కొండపావులూరు ఎస్డీఆర్ఎఫ్(పదవ జాతీయ విపత్తు ప్రతిస్పందన) సౌత్ సెంట్రల్ జోన్ ప్రాంతీయ స్థాయి విపత్తుల నివారణ పోటీలు మంగళవారం ముగిశాయి. ఏపీ స్పెషల్ పోలీస్ బెటాలియన్‌ల ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ బి.రాజకుమారి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. రెండు రోజుల పాటు స్థానిక 10వ బెటాలియన్ ఎన్డీఆర్ఎఫ్ ప్రాంగణంలో జరిగిన పోటీలలో ఏపీ, తెలంగాణ, కర్నాటక, ఒడిశా, చత్తీస్‌గఢ్, తమిళనాడు రాష్ట్రాల నుంచి ఎస్డీఆర్ఎఫ్ బృందాలు, కేరళ అగ్నిమాపక శాఖ బృందం పోటీల్లో పాల్గొన్నాయి. ఈ సందర్భంగా రాజకుమారి మాట్లాడుతూ ఎస్డీఆర్ఎఫ్ బృందాలు నైపుణ్యాలను, అనుభవాన్ని, ఉత్తమ పద్ధతులను ప్రదర్శించడానికి ఈ పోటీలు ఒక వేదిక అన్నారు. ఎన్డీఆర్ఎఫ్ బృందం వివిధ రకాల విపత్తుల నివారణ ప్రదర్శన, పరికరాల గ్యాలరీ ఏర్పాటు చేసింది. ఏపీ ఎస్డీఆర్ఎఫ్ విజేతగా గెలిచి ప్రాంతీయ స్థాయి ట్రోఫీని గెలుచుకుంది. ఒడిశా ఎస్డీఆర్ఎఫ్ ద్వితీయ స్థానంలో నిలిచింది. విజేతలను అధికారులు అభినందించారు. ఎన్డీఆర్ఎఫ్ డీఐజీ హరి ఓం గాంధీ, కమాండెంట్ నాగేంద్ర శర్మ, నిరంజన్ సింగ్, జఫిరుల్ ఇస్లాం పాల్గొన్నారు.


విజేతలకు ట్రోఫీ అందజేస్తున్న ముఖ్య అతిథి రాజకుమారి

కానూరులో జూనియర్ లైన్‌మన్‌పై దాడి

పెనమలూరు: కానూరులో జూనియర్ లైన్‌మన్, వాచ్‌మన్‌లపై పలువురు వ్యక్తులు దాడి చేయటంతో పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ వెంకటరమణ తెలిపిన వివరాల ప్రకారం కానూరులో విద్యుత్ శాఖలో జూనియర్ లైన్‌మన్‌గా తంగెళ్లమూడి సాయిరామ్, వాచ్ మన్‌గా శివబ్రహ్మం పని చేస్తున్నారు. అదే గ్రామానికి చెందిన దగాని రవి, దగాని రాజేష్, మణికంఠ బైక్ పై వస్తున్న సాయిరామ్, శివబ్రహ్మంలను ఆపి, మీవలనే మా ఉద్యోగాలు పోయాయంటూ దాడి చేశారు.ఈ ఘటనలో గాయపడిన సాయిరామ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు దాడి చేసిన వ్యక్తులపై కేసు నమోదు చేశారు.

పోరంకిలో వ్యక్తిపై దాడి

పెనమలూరు: పోరంకిలో ఓ వ్యక్తిపై మరో వ్యక్తి దాడి చేయటంతో పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పోరంకి శ్రీనివాసనగర్ బృందావన్ అపార్టుమెంట్‌కు చెందిన వి.అప్పారావు సోమవారం తాను ఉంటున్న అపార్టుమెంట్ వద్ద సిమెంట్ బల్లపై కూర్చోవటానికి వచ్చాడు. అప్పటికే బల్లపై తలశిల బేబీరావు కూర్చుని ఉండటంతో కొద్దిగా జరగమని కోరాడు. దీంతో బేబీరావు ఆగ్రహంతో అప్పారావును దూషించి అక్కడే క్రికెట్ ఆడుతున్న పిల్లల వద్ద క్రికెట్ బ్యాట్ తీసుకోని అప్పారావుపై దాడి చేశాడు. అప్పారావు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

కామన్ స్థలాలపై కబ్జాదారుల కన్ను

విజయవాడరూరల్: మండలంలోని గ్రామ పంచాయతీలలో కామన్ స్థలాలను కాజేసేందుకు ఆక్రమణదారులు కన్నేశారు. విజయవాడ నగరానికి ఆనుకుని ఉన్న గ్రామాల్లో స్థలాల రేట్లు రోజు రోజుకు పెరుగుతుండడంతో కామన్ స్థలాల పక్కనే వున్న పట్టా భూములను కొనుగోలు చేసి తర్వాత కామన్ స్థలాలను ఆక్రమించుకునే ప్రయత్నాలు చేస్తున్నారు. రియల్ ఎస్టేట్ బ్రోకర్ల అవతారమెత్తిన కొందరు ఇదే పనిగా పెట్టుకుని గ్రామాల్లో నిత్యకృత్యంగా కార్యకలాపాలు నిర్వహిస్తున్నారు. గ్రామాల్లో అధికార పార్టీకి చెందిన వారు ఆక్రమణదారులకు స్లీపింగ్ పార్టనర్లుగా వ్యవహరించడం గమనార్హం. ముందుగా వీరు పంచాయతీ పాలకవర్గాల్లో కీలక పదవుల్లో వున్న వారి మద్దతుతో పంచాయతీ కామన్ స్థలాలు ఎక్కడెక్కడ ఉన్నాయో వాటి వివరాలను సేకరిస్తున్నారు. ఆ తర్వాత స్థలాలను కొనుగోలు చేసే వారికి వాటి సమాచారం అందజేస్తున్నారు. విజయవాడ రూరల్ మండలం అంబాపురం గ్రామంలో ఇటీవల కొందరు విలువైన కామన్ స్థలంలో చలివేంద్రం పేరుతో పెద్ద పందిరి వేసేందుకు ప్రయత్నం చేయగా, ఆ ప్రయత్నాన్ని స్థానికులు అడ్డుకున్నారు. పాతపాడు గ్రామంలో సబ్బన్న చెరువు స్థలం ఆక్రమణకు అధికార పార్టీ నాయకులు ప్రయత్నించారు. ఆ స్థలం విషయంలో రెండు వర్గాలు పోటీ పడి గొడవ పడటంతో రెండు వర్గాలు పోలీసు స్టేషన్లో పరస్పరం కేసులు పెట్టుకున్నారు. పి.నైనవరం గ్రామంలో చెరువు పోరంబాకు భూమిని ఆక్రమణకు గురైంది. ఈ విధంగా మండలంలోని ప్రతి గ్రామంలో కామన్ స్థలాలు, ప్రభుత్వ స్థలాలను ఆక్రమించుకునేందుకు ముమ్మరంగా ప్రయత్నాలు జరుగుతున్నాయి. కొందరు ప్రభుత్వ భూమిని తప్పుడు సర్వే నంబర్లతో అమ్ముకొని పెద్ద మొత్తంలో జేబులు నింపుకొంటున్నారు. ఈ తతంగమంతా రెవెన్యూ అధికారులకు తెలియకుండా జరుగుతుందా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. గ్రామాల్లో ఉన్న ప్రభుత్వ భూముల వివరాలను, కామన్ స్థలాల వివరాలను, రెవెన్యూ అధికారులు సర్వే నంబర్లతో సహా ఎందుకు వెల్లడించడం లేదని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. అధికారుల నిర్లక్ష్యమే ఆక్రమణదారులకు అవకాశాలు కల్పిస్తున్నాయని విమర్శలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో గ్రామాల్లో కామన్ స్థలాల వివరాలను తెలియజేయాలని ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు ఇటీవల రెవెన్యూ అధికారులను ఆదేశించడం గమనార్హం.

రీ సర్వేతో భూ యజమానులకు మేలు

ఉయ్యూరు ఆర్డీఓ హెలా షారోన్

కంకిపాడు: రీ సర్వే ప్రక్రియతో భూ యజమానులకు మేలు జరుగుతుందని ఉయ్యూరు ఆర్డీఓ హెలా షారోన్ అన్నారు. మండలంలోని మారేడుమాక గ్రామంలో చేపట్టిన ఏపీ రీ సర్వే ప్రాజెక్టుపై మంగళవారం గ్రామసభ నిర్వహించారు. కార్యక్రమానికి ఆర్డీఓ హెలా షారోన్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. రీసర్వే ప్రాజెక్టుకు సంబంధించి భూమి సర్వే చేసిన 93 మంది రైతులకు 9(2) నోటీసులు అందించారు. భూమి తక్కువగా చూపారంటూ పలువురు రైతులు వినతులు అందించటంతో క్షేత్రస్థాయికి వెళ్లి భూ సర్వేను పరిశీలించారు. అనంతరం నిర్వహించిన సభలో ఆర్డీఓ మాట్లాడుతూ రీ సర్వే ప్రాజెక్టు రైతులకు ఉపయుక్తం అన్నారు. రైతులు తమ భూములకు సంబంధించిన సరైన రికార్డులను అధికారులకు అందిస్తే సర్వేను పూర్తి చేసి హద్దులు నిర్ణయించి అప్పగిస్తారన్నారు. రైతులు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో తహసీల్దార్ వి.భావనారాయణ, డెప్యూటీ తహసీల్దార్ శ్రీనివాసరావు, మండల సర్వేయరు భాస్కర్‌రావు, సర్పంచ్ సీహెచ్ ఆదర్శకుమార్ పాల్గొన్నారు.


మారేడుమాక గ్రామసభలో భూ యజమానులకు నోటీసులు అందజేస్తున్న ఆర్డీఓ హెలా షారోన్

రబీ పంట నమోదు వివరాలు పరిశీలించుకోవాలి

పెనమలూరు: రబీ 2024–2025 సంవత్సరానికి సంబంధించి ఈ–పంట నమోదు ప్రక్రియ ముగిసిందని, ఈ మేరకు రైతు సేవా కేంద్రాలలో వివరాలు ప్రకటించామని మండల వ్యవసాయాధికారి కనకమేడల శైలజ తెలిపారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా పెనమలూరు గ్రామంలో మంగళవారం రైతులతో ఏవో మాట్లాడారు. రైతులు నమోదు చేసుకున్న పంట వివరాలు ప్రకటించినందున రైతులు ఆ జాబితాలను పరిశీలించి తప్పులు ఉంటే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. పెసలు, మినుము పంటలకు సంబంధించి వివరాలు సీఎం యాప్‌లో నమోదు చేశామన్నారు. ప్రభుత్వం మార్క్‌ఫెడ్ ద్వారా పెసలు, మినుము పంటలు కొనుగోలు చేసే అవకాశం ఉందన్నారు. పెసలు, మినుము కొనుగోలు ధరలు త్వరలో ప్రభుత్వం ప్రకటిస్తుందని అన్నారు. సీఎం యాప్‌లో నమోదు చేసుకున్న రైతులకు మాత్రమే పంటల అమ్మకాలకు షెడ్యూల్ ఇస్తామన్నారు. పంటలు నమోదు చేసుకోని వారు వెంటనే సీఎం యాప్‌లో పంట నమోదు చేసుకోవాలని సూచించారు. వ్యవసాయ సాగుకు రైతులు యాంత్రీకరణపై దృష్టి పెట్టాలన్నారు. కార్యక్రమంలో వీఏఏ అనూష, రైతులు పాల్గొన్నారు.


పెనమలూరులో పంటలు పరిశీలిస్తున్న ఏవో శైలజ

పేద విద్యార్థికి మానవత ఆర్థికసాయం

హనుమాన్‌జంక్షన్ రూరల్: ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రతిభావంతులైన పేద విద్యార్థులకు మానవత ఎల్లప్పుడూ అండగా ఉంటుందని ఆ సంస్థ రాష్ట్ర కన్వీనర్, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత మారుబోయిన కోటేశ్వరరావు అన్నారు. బాపులపాడు మండలం పెరికీడుకు చెందిన ఆటో డ్రైవర్ బొడ్డుపల్లి సింహాద్రి మృతి చెందటంతో బీటెక్ చదువుతున్న ఆయన కుమార్తె మౌనిక విద్యా ఖర్చుల బాధ్యతలను మానవత స్వీకరించి, ఏటా ఫీజులు చెల్లిస్తోంది. ఈ నేపథ్యంలో నరసరావుపేటలో బీటెక్ నాల్గో సంవత్సరం చదువుతున్న మౌనికకు స్థానిక ఏలూరురోడ్డులోని మానవత స్వచ్ఛంద సేవా సంస్థ కార్యాలయంలో రూ.10,500 విరాళాన్ని మంగళవారం అందించారు. ఈ ఏడాదితో బీటెక్ పూర్తి కావటంతో తదుపరి పోస్ట్ గ్రాడ్యుయేషన్ చదువుకు అయ్యే ఖర్చులను కూడా మానవత సంస్థ భరిస్తుందని మారుబోయిన చెప్పారు. మానవత హనుమాన్‌జంక్షన్ శాఖ సీనియర్ సభ్యులు గంటా సత్యనారాయణ, ఇందిరాదేవి, పాబోలు గణేష్, జన్యావుల సత్యనారాయణ, వేగిరెడ్డి సూర్యనారాయణ, రేవిణిశెట్టి సూర్యనారాయణ, చెక్కా సుబ్బారావు, కూరెళ్ల సుబ్బాచారి, పొట్లూరి శేషాచలం పాల్గొన్నారు.


బీటెక్ విద్యార్థిని మౌనికకు ఆర్థికసాయం అందిస్తున్న మానవత సభ్యులు

సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలి

రామవరప్పాడు: సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు సమాన పనికి సమాన వేతనాన్ని పారిశుద్ధ్య కార్మికులకు ఇవ్వాలని సీఐటీయూ మండల కార్యదర్శి పి. వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. విజయవాడ రూరల్ మండలం గూడవల్లి పంచాయతీ కార్యాలయం వద్ద పారిశుద్ధ్య కార్మికులతో కలిసి వేతనాన్ని పెంచి ఇవ్వాలని డిమాండ్ చేస్తూ నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ రామవరప్పాడు, ప్రసాదంపాడు, ఎనికేపాడు, నిడమానూరు గ్రామాల్లో గత సంవత్సరంలో రూ.13వేలు పంచాయతీ కార్మికులు వేతనంగా ఇచ్చారన్నారు. గూడవల్లి పంచాయతీ కార్మికులకు మాత్రం కేవలం రూ.8250 మాత్రమే వేతనంగా ఇస్తున్నారన్నారు. పక్క పంచాయతీల్లో మాత్రం రూ.13 వేలు ఇస్తున్నా గూడవల్లి పంచాయతీలో మాత్రం పారిశుద్ధ్య కార్మికులకు వేతనాన్ని ఎందుకు పెంచడం లేదని ప్రశ్నించారు. మార్చి నెల నుంచైనా పక్క గ్రామాల్లో ఇస్తున్నట్లుగా ఈ పంచాయతీలో కూడా రూ.13వేలు వేతనంగా ఇవ్వాలని డిమాండ్ చేశారు.

ఉత్సాహంగా నలంద కేజీ గ్రాడ్యుయేషన్ వేడుకలు

లబ్బీపేట(విజయవాడతూర్పు): చిన్నారుల కేరింతల నడుమ నలంద విద్యానికేతన్ కేజీ గ్రాడ్యుయేషన్ డే వేడుకలు మంగళవారం ఉత్సాహంగా సాగాయి. కిండర్ గార్డెన్ విద్యను పూర్తిచేసుకున్న చిన్నారులు నల్ల కోటు, టోపీ ధరించి, కేజీ పట్టాలను అందుకున్నారు. ముఖ్య అతిథులుగా డాక్టర్ రోహిత, డాక్టర్ లక్ష్మీశ్రీ, డాక్టర్ సోమలత, ప్రొఫెసర్ రమ్యతోపాటు స్కూల్ ప్రిన్సిపాల్ మాదల పద్మజ, కేజీ ఇన్‌చార్జి రాజేశ్వరి పాల్గొన్నారు.

క్లుప్తంగా

పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలని వినతి



గన్నవరం: రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సమస్యలను పరిష్కరించాలని గన్నవరం తాలూకా విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు అవుటపల్లి మోహన్‌రావు ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు మంగళవారం స్థానిక తహసీల్దారు కె.వెంకటశివయ్యను కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా మోహన్‌రావు మాట్లాడుతూ పెన్షనర్లకు సామాజిక, ఆరోగ్య భద్రత కల్పించాలని, ప్రభుత్వం చెల్లించాల్సిన బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సంఘ నేతలు ఎస్‌కే ఆదాంవలిసాహెబ్, నందం బసవేశ్వరరావు, కోటేశ్వరరావు, కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

నిరుపేద ముస్లింలకు రంజాన్ తోఫా



పెనమలూరు: కానూరు తులసీనగర్‌లో మంగళవారం నిరుపేద ముస్లింలకు రంజాన్ పండుగ సందర్భంగా సత్యమార్గం చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో నిత్యావసర సరుకులతో రంజాన్ తోఫా పంపిణీ చేశారు. ట్రస్టు చైర్మన్ నజీర్ అహ్మద్‌ఖాన్ మాట్లాడుతూ తాడిగడప మున్సిపాలిటీ పరిధిలో 100 నిరుపేద కుటుంబాలకు రంజాన్ తోఫా అందజేశామన్నారు. వైఎస్సార్ సీపీ నాయకుడు మహమ్మద్ సిద్దిక్ మాట్లాడుతూ రంజాన్ పండుగను పేద ముస్లింలు ఆనందంగా జరుపుకోవటానికి రంజాన్ తోఫా అందజేశామని తెలిపారు. కుల మతాలకు అతీతంగా ట్రస్టు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తుందని అన్నారు. కార్యక్రమంలో అబ్దుల్‌గఫూర్, అస్లం, షఫీ, పలువురు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి



ఉంగుటూరు: విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లో కూడా రాణించాలని ప్రముఖ సినీ నిర్మాత, కళాశాల కరస్పాండెట్, సెక్రటరీ సుంకర అనిల్ అన్నారు. ఉంగుటూరు మండలం తేలప్రోలు ఉషారామ ఇంజినీరింగ్ కళాశాలలో 17వ వార్షిక క్రీడా మహోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు, సిబ్బంది కలసి క్రీడా మహోత్సవం 45 రోజులు కొనసాగించడం ప్రశంసనీయం అన్నారు. ప్రిన్సిపాల్ జీవీకేఎస్వీ ప్రసాద్ మాట్లాడుతూ విద్యా నైపుణ్య ఆవిష్కరణలు, సమగ్ర అభివృద్ధి పెంపొందించేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు. చెస్, టెన్నికాయిట్, త్రోబాల్, వాలీబాల్, క్రికెట్, బాస్కెట్‌బాల్, లాంగ్ జంప్, షాట్‌పుట్ తదితర ఆటల పోటీలలో 621మంది విద్యార్థులు బహుమతులు గెలుచుకున్నారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ సుంకర రాంబ్రహ్మం, సాగర్, అధ్యాపక బృందం పాల్గొన్నారు.

నేటి నుంచి 22 వరకు ఆధార్ నమోదు శిబిరాలు

కంకిపాడు: మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం నుంచి 22వ తేదీ వరకు ఆధార్ నమోదు ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ పి.అనూష తెలిపారు. మంగళవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ మండల కేంద్రమైన కంకిపాడు, కోలవెన్ను సచివాలయాల్లో ఆధార్ శిబిరాలు ఏర్పాటు చేశారని, ఈ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వీఎంసీలో ఉద్యోగోన్నతులు

పటమట(విజయవాడతూర్పు): నగరపాలక సంస్థలో క్లాస్–4గా విధులు నిర్వహిస్తున్న పలువురు ఉద్యోగులకు ఉద్యోగోన్నతి కల్పిస్తు మునిసిపల్ కమిషనర్ ధ్యానచంద్ర మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. అంబేడ్కర్ స్మృతివనం క్యాష్‌కౌంటర్‌లో విధులు నిర్వహిస్తున్న గార్డెనర్ ఎం.విజయలక్ష్మికి ప్రమోషన్ ఇచ్చి, సెక్రటరీ సెల్‌కు జూనియర్ అసిస్టెంట్‌గా బదిలీ చేశారు. మొగల్రాజపురం ఆయుర్వేద డిస్పెన్సరీలో విధులు నిర్వహిస్తున్న ఎఫ్ఎన్ఓ వర్కర్ డి.బుజ్జికి ఉద్యోగోన్నతి కల్పించి ఎస్టేట్స్ సెక్షన్‌కు జూనియర్ అసిస్టెంట్‌గా బదిలీ చేశారు. వీఎంసీ ప్రధాన కార్యాలయంలో ఆఫీస్ సబార్డినేట్ జీజేఎంఎస్ ప్రశాంతిని ఆడిట్ సెక్షన్‌కు జూనియర్ అసిస్టెంట్‌గా బదిలీ చేశారు. కండ్రికలోని బి.వి. సుబ్బారెడ్డి వీఎంసీ స్కూల్లో ఆఫీస్ సబార్డినేట్‌గా విధులు నిర్వహిస్తున్న కె.రామకృష్ణను సర్కిల్–1 పట్టణ ప్రణాళిక విభాగానికి జూనియర్ అసిస్టెంట్‌గా ఉద్యోగోన్నతిపై బదిలీచేశారు. వీఎంసీ ఎస్టాబ్లిష్ సెక్షన్‌లో విధులు నిర్వహించే ప్రజారోగ్య విభాగం పీహెచ్ వర్కర్ ఎ.వెంకటేశ్వరమ్మకు జూనియర్ అసిస్టెంట్‌గా ప్రమోషన్ కల్పించి అక్కడే విధులు నిర్వహించేలా ఆదేశాలు జారీ చేశారు. ప్రజారోగ్య విభాగంలో శానిటరీ మేస్త్రీగా విధులు నిర్వహించే జి.పద్మశ్రీని అదే సెక్షన్‌కు జూనియర్ అసిస్టెంట్‌గా బదిలీ చేస్తూ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు | వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు | శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

పెనమలూరు డివిజన్
90105 77706 (ఉయ్యూరు)
99122 20539 (పెనమలూరు)
90102 10382 (గన్నవరం)
Office mail : sakshiads@gmail.com